# నవ జీవనం

ఆ యిల్లు విషాదంలా వుంది. ఆ యింట్లోని మనుషులు నిరాశతో వచ్చే నిట్టూర్పుల్లా వున్నారు.

అరగంట క్రితం ఆ యిల్లు ఏ ఆలోచన లేని మెదడులా వుంది. సుభద్ర అత్తవారింటి నుంచి నాలుగు మైళ్లు నడిచి నడిచి వస్తూ వస్తూ బోలెడు విషాదాన్ని మోసుకుని మరీ వచ్చింది. సుభద్ర తల్లీ, తండ్రీ, తమ్ముడూ తలో కాస్త విషాదాన్ని పంచుకున్నారు.

పదిహేను నెలల క్రితం సూర్యానికి హైదరాబాద్ నుంచి ఇంటర్వ్యూ 'ఉద్యోగం' ఆశ చూపిస్తూ వచ్చింది. వెళ్దామంటే డబ్బులేదు మానేద్దామంటే మొదటి ఇంటర్వ్యూ కావడం వల్ల మనసు వొప్పలేదు. ఏడు మైళ్లు డొక్కు సైకిలు మీద కాలేజీకి వెళ్ళి మరీ చదివాడు బి. ఎ వరకూ. రెండేళ్ళ నుంచీ ఖాళీగా వున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో సుభద్ర యిక్కడే వుంది. ఇంట్లోని పరిస్థితి చూసి, తన పెళ్ళినాడు పెట్టిన బంగారు

గాజుల జత తీసి తమ్ముడికిచ్చింది. తాకట్టు పెట్టి డబ్బు తెచ్చుకోమంది. సూర్యం గాజులు తాకట్టు పెట్టాడు. నూటయాభై రూపాయలు పట్టుకొచ్చాడు.

ఇంటి ఖర్చులకు యాభై రూపాయలిచ్చి. సర్టిఫికెట్లూ, వంద రూపాయలూ పట్టుకుని సూర్యం హైదరాబాదు వెళ్లాడు. అయిదు రోజులకు తిరిగొచ్చాడు. ఉద్యోగం సంపాదించి కాదు - ఉత్త చేతులతో.

రోజులు గడుస్తున్నాయి. సూర్యం ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఎంప్లాయిమెంటు ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాడు.

ఆకాశం నీలంగా వుంటూనే వుంది. వర్షం కురుస్తూనే వుంది. వెన్నెల వెండిలా మెరిసి పోతూనే వుంది. ఎండ నిప్పుల్ని వూదుతూనే వుంది. మార్వాడీ కొట్లో వడ్డీ పెరిగి పోతూనే వుంది.

జరిగిపోయిన కథలోంచి జరుగుతున్న కథలోకి వస్తే -

సుభద్రకీ, వాళ్ల అత్తగార్కీ ఈ మధ్య పడకపోవడం వల్ల గొడవ వచ్చిపడింది. సుభద్రను ఎలా రాచి రంపాన పెట్టాలా అని ఆలోచిస్తున్న అత్తగార్కి తళుక్కున ఆలోచన రానే వచ్చింది. గాజులేం చేశావని అడిగింది. సుభద్ర నిజాన్ని నిర్భయంగా చెప్పింది.

సుభద్ర అత్తగారు గట్టిగా అరిచింది. మాదంతా దోచేసి మీ పుట్టింటికి తరలించేస్తున్నావంది ఇలాగైతే మా యిల్లు గుల్లయిపోతుంది అంది. తక్షణం వెళ్లి, గాజులు పట్టుకొస్తేనే యింట్లోకి రానిచ్చేదంది. సుభద్రను బయటను గెంటేసింది.

భర్త యింట్లో లేక పోవడం వల, చేసేదేమీ లేక సుభద్ర నాలుగు మైళ్లు నడిచి నడిచి వస్తూ బోలెడు విషాదాన్ని మోసుకుని మరీ వచ్చింది.

"నువ్వొస్తుంటే మీవారేమీ అనలేదా"

"ఆయన వూళ్లో లేరమ్మా"

"యిదంతా నా గురించే జరిగింది" అన్నాడు సూర్యం బాధపడుతూ.

"ఇప్పుడేం అనుకుంటే ఏం లాభం? ధాన్యం షావుకారి దగ్గరకు వెళ్లి వస్తానుండు" అని సుభద్ర తండ్రి వీధిలోకి నడిచాడు.

తిన్నగా ధాన్యం షావుకారి దగ్గరకెళ్లాడు. పరిస్థితి చెప్పుకున్నాడు. కోతలు కోయగానే ధాన్యం తూచేస్తానన్నాడు, ఎలాగైనా డబ్బు సర్దమన్నాడు. షావుకారు మొదట, ధాన్యం తూయకుండా డబ్బివ్వనన్నాడు, ఆఖరికి, ధాన్యం తూసేటప్పటికి వుండే ధరకు, బస్తాకు మూడు రూపాయలు తగ్గించి ఇచ్చాడు, రెండొందలు తీసుకుని ఇంటికొచ్చి కొడుక్కిచ్చాడు. గాజులు విడిపించుకుని రమ్మన్నాడు.

సూర్యం బట్టలు మార్చుకుని పట్నం బయల్దేరాడు.

పంచాయితీ బోర్డు రేడియో నుంచి కార్మికుల కార్యక్రమం ప్రసారమవుతోంది ఒక కార్మికునితో ఇంటర్వ్యూ.

"నువ్వు పనిజేసే కార్ఖానాలో పని కష్టంగా వుంటుందా, సులభంగా వుంటుందా"

"సుఖవుగానే వుంటుందండి"

"ప్రతినెలా జీతాలు సక్రమంగా యిస్తారా"

"మొదటి తారీఖునే ఇచ్చేస్తారండి"

"నీకిచ్చే జీతం సరిపోతుందా"

"సరిపోకేమండి, ఇంకా మిగులుతుంది కూడా"

నడుస్తూ వింటున్న సూర్యానికి నవ్వొచ్చింది. "మిగిలింది ఏం చేస్తావు" అన్న ప్రశ్న. "వడ్డీకిచ్చుకుంటానండి" అనే జవాబు కూడా ప్రసారం చేస్తే బావుండు ననుకున్నాడు.

ఊరుదాటేడు. ఒక మైలు నడిచాడు. దోనెమీద కాలువ దాటేడు. మరో రెండు ఫర్లాంగులు నడిచాడు. బస్సు కోసం చూస్తూ నిలబడ్డాడు. బస్సు వచ్చింది. ఎక్కేడు. ఓ గంట గడిచింది. బస్సు పట్నంలోకి బాణంలా దూసుకుపోయి వంతెనకు దిగువగా ఆగింది.

సూర్యం బస్సు దిగాడు.

"బాబూ, కారులోంచి పడిపోయానండి. ధర్మ చెయ్యండి బాబూ" పదిహేనేళ్ల కుర్రోడు అడుక్కుంటున్నాడు.

సూర్యం అతన్ని చూశాడు వాడిది వరకు ఈ బస్సులోనే క్లీనర్‌గా పని చేసేవాడు. బస్సునిండా జనాన్ని ఎక్కించేసి, తను తలుపు పట్టుకుని వేలాడేవాడు. అలా యజమానికి లాభాలు పెరగడానికి తోడ్పడేవాడు. పాపం, ఎప్పుడు పడ్డాడో బస్సులోంచి పడ్డాడు. కాలు పచ్చడైపోయింది. క్లీనర్ ఉద్యోగం పోయింది. అడుక్కునే ఉద్యోగం వచ్చింది.

సూర్యం హృదయం ద్రవించి పోయింది. మెయిన్ రోడ్డు మీద నడుస్తున్నాడు. కాళ్లకు జోళ్లులేవు. నిప్పుల దారిమీద నడుస్తున్నట్టుంది. ఎండ వేడిగా కాస్తోంది. వెల్‌కమ్ హోటల్ దగ్గరికి వచ్చేడు. "ఆపద మొక్కులవాడా. ఓ శ్రీనివాసా" అని పాడుతూ హోటల్ ముందు కూచుని అడుక్కుంటున్నాడొకడు.

వేగంగా నడుస్తూ సూర్యం, నాలుగురోడ్ల సెంటరు దగ్గర ఆగాడు. కుడిపక్కకు తిరిగాడు నాలుగడుగులు వేసేడు. "శేఠ్ ..." బోర్డు చూశాడు లోపలికి వెళ్ళాడు.

మెత్తని పరుపుమీద తలకింద చెయ్యి పెట్టుకుని మార్వాడీ నాటకాల కృష్ణుడి ఫోజులో, మార్వాడి బంగారు రంగులో అమృతపాణీ అరటి పండులా వున్నాడు. నుదుట చిన్న బొట్టు వుంది.

మార్వాడీ సూర్యాన్ని చూసి, లేచి, గోడకు జారబడ్డాడు.

"ఏం కావాలి"

"మీ దగ్గర జత బంగారు గాజులు సంవత్సరం క్రితం తాకట్టు పెట్టాను. విడిపించుకోమని మీ దగ్గర్నుంచి లెటరు కూడా వచ్చింది. తీసుకుపోదామని వచ్చాను.

"ఎంతకు పెట్టారు"

"నూట యాభైకి"

మార్వాడీ తన గుమస్తా వంక చూశాడు. గుమస్తా రెండు చెక్కల మధ్య కట్టిన కాగితాన్ని తీసి, వెదికి, ఒక కాగితం మార్వాడీకిచ్చాడు. మార్వాడీ గుమస్తాని లెక్క కట్టమని చెప్పి, యినుప బీరువా దగ్గరకెళ్లాడు. ఒక సొరుగులాగి, అందులోని వస్తువుల్ని వెదికి, బంగారు గాజుల జత తీశాడు. వాటికి కట్టిన చీటీ విప్పాడు.

"పదహారు నెలలయ్యింది వడ్డీ యాభై నాలుగు రూపాయలు" అన్నాడు గుమస్తా.

యాభై నాలుగు రూపాయలెలా అయ్యింది? పదహారు నెలలు ఎలా అయ్యింది? చీటీ ఒకసారి చూడండి పదిహేను నెలలే అయ్యింది. ఇదుగో, ఇందులో వేసిన తారీఖు ప్రకారం పదిహేను నెలలే అయ్యింది. నెలకి నూటికి రెండు రూపాయల వడ్డీ చొప్పున నూట యాభైకి మూడు రూపాయలు. పదిహేను నెలలకూ నలభై ఐదు"

"మీ లెక్కకీ మా లెక్కకీ ఒకనెల తేడా వస్తుంది. తర్వాత, వడ్డీకి వడ్డీ కడతాం"

"మీకో లెక్కా మాకో లెక్కా ఎలా వుంటుంది. వడ్డీకి వడ్డీ కడతామని ముందే ఎందుకు చెప్పలేదు"

" ఆ అవసరం మాకు లేదు ఇంతకీ తీసుకెళ్లే బేరమేనా" వ్యంగ్యంగా నవ్వుతూ మార్వాడీ.

సూర్యం కళ్లకు మార్వాడీ అసహ్యంగానే కాకుండా, కలుపు మొక్కలా కూడా కనిపించాడు.

ఇద్దరూ కొంచెం సేపు వాదించుకున్నారు. ఇద్దరి లెక్కాకీ వున్న తేడా తెగలేదు. అన్యాయంగా అనవవరంగా మార్వాడీకి ఎందుకు ఎక్కువ యివ్వాలనుకున్నాడు సూర్యం.

"న్యాయంగా తారీఖు ప్రకారం వడ్డీ నలభై ఐదూ, అసలు నూట యాభై కలిపి మొత్తం నూట తొంభై అయిదూ ఇవిగో" అని ఎదురుగా వున్న బల్లమీద పెట్టాడు సూర్యం.

"మిగతా తొమ్మిది ఏవి"

"అవి యివ్వనవసరం లేదు, గాజులిలా ఇయ్యి"

"ఇవ్వను"

"ఎందుకివ్వవూ"

"ఎందుకివ్వాలి"

సూర్యం మార్వాడీ దగ్గరికెళాడు. అతవి చేతుల్లోంచి గాజులు లాక్కున్నాడు. గుమ్మం దాటబోయాడు. మార్వాడీ సూర్యం కాలరు పట్టుకున్నాడు,

"నక్సలైటులా వున్నావే, గాజులు పట్టుకు పోదామనే"

"ముందు కాలరొదులు, నీకు రావలసింది నీకు ముట్టిందిగా"

మార్వాడీ సూర్యం చేతిలోని గాజులు లాక్కోబోయాడు. సూర్యం మార్వాడీని బలంగా తోశాడు. మార్వాడీ తల గుమ్మానికి తగిలింది, నుదురు చిట్లింది, రక్తం కారింది. రక్తాన్ని చూసి మార్వాడీ గజగజ వణికాడు.

పక్క కొట్టుల్లోంచి కొంతమంది గబగబా వచ్చారు. సూర్యాన్ని పట్టుకున్నారు. గుమస్తా సిగ్గుతో తలవంచుకుని నిలుచున్నాడు. మార్వాడీ వణుకుతూ చెప్పగా, గుమస్తా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశాడు.

* * *

రోడ్డు బ్లాక్ కలర్ పేపర్‌లా వుంది. సూర్యం నడుస్తున్నాడు అటూ ఇటూ చూస్తూ నడుస్తున్నాడు. అంతా బిజీగా వున్నారు.

హోటళ్ల దగ్గరా, కిళ్లీ బడ్డీల దగ్గరా ఒక్క ముష్టివాడు కూడా లేడు.

సూర్యం బస్‌స్టేండ్ దగ్గర కొచ్చాడు. తిరుపతి గుండు కానీ, అన్నవరం గుండు కానీ కనిపించలేదు. సూర్యం ఆశ్చర్యపోతూ ముందుకు నడిచాడు.

ఎక్కడా ఎవరూ ఏం చదివేవనీ, ఏం చేస్తున్నావనీ ఎవర్నీ అడగడం లేదు. నీ కులం ఏవిటని అడగడం లేదు. నీ వృత్తేవిటని అడుగుతున్నారు. ఏం ఉద్యోగం చేస్తున్నావని అడుగుతున్నారు.

సూర్యం నడుస్తూ దేవాలయం దగ్గరికొచ్చాడు. కొంతమంది బయటికొచ్చారు. వాళ్ళ ముఖాల్ని బొట్లు లేవు. చెవుల్లో పువ్వులు లేవు. వాళ్లు దేవాలయం మీది శిల్పాల గురించీ, శిల్పుల ప్రతిభ గురించీ మాట్లాడుకుంటున్నారు. సూర్యం సంభ్రమంగా వాళ్ళను చూశాడు.

పక్కరోడ్డు మీదకు తిరిగాడు. కుడిచేతి వైపున 'బొమ్మల పరిశ్రమ' బోర్డు కనిపించింది,

ఒకడు మట్టితో బొమ్మలు చేస్తున్నాడు. సూర్యం వాడ్ని పరీక్షగా చూశాడు, వాడిది వరకు వెల్‌కమ్ హోటల్ దగ్గర 'ఆపద మొక్కుల వాడా ఓ శ్రీనివాసా' అని పాడుతూ అడుక్కునేవాడు. వాడిప్పుడు బొమ్మలు చేస్తూ, "ఎరువంటే కొందరికి భయం భయం- పసి పిల్లలు వారికన్న నయం నయం" అని పాడుకుంటున్నాడు ఉత్సాహంగా. మరొకడు బొమ్మలకు రంగులు వేస్తున్నాడు. అతన్ని సూర్యం పరిశీలనగా చూశాడు. అతనింతకు ముందు రోడ్డు మీద బొమ్మలు వేసి, అడుక్కునేవాడు. అతని చేతిలోని బొమ్మను చూశాడు సూర్యం, అతనప్పుడు ఆ బొమ్మ కళ్లల్లో ఎర్ర జీరల్ని చిత్రిస్తున్నాడు సూర్యం మిగతా బొమ్మల్ని చూశాడు.

ఆ బొమ్మల్లో ఏ దేవుడి బొమ్మా లేదు. సమాజాన్ని ప్రతిబింబించే బొమ్మలున్నాయి-చైతన్యవంతం చేసే బొమ్మలున్నాయి,

సూర్యం అక్కడనుంచి ముందుకు నడిచాడు, అక్కడింతకు ముందు వుండే పూరి గుడిసెలు లేవు. మురికి వాడలు లేవు. అందంగా సింపుల్‌గా యిప్పుడక్కడ పెంకిటిళ్లున్నాయి. వాకిళ్లు యిస్త్రీ చేసిన దుప్పట్లలా వున్నాయి, దొక్కలెండి ఆకలి కళ్లతో అడుగడుగునా కన్పించే వాళ్లెవరూ లేరు. ప్రతి మనిషి యాపిల్ పండులా వున్నాడు. ప్రతి ముఖం తృప్తిగా వుంది.

సూర్యం సంతోషంగా నడుస్తున్నాడు. ఎడమచేతి వైపున వుండాల్సిన 'ఎంప్లాయ్‌మెంటు ఆఫీసు' కనిపించలేదు బిల్డింగ్ మాత్రం

వుంది. బోర్డు లేదు. అటువైపు వస్తున్న వాణ్ని చూపి, ఇక్కడి ఆఫీసు ఏమైందని సూర్యం అడిగాడు. అతను సూర్యాన్ని అదోలా చూపి "ఇంకా ఎంప్లాయ్‌మెంటు ఆఫీసెందుకు? చదువును బట్టీ, అతని ఇంటరెస్టును బట్టీ పాసైన సర్టిఫికేట్ మీద ఫలానా ఉద్యోగం అని రాపిస్తారు. వెళ్లి జాయినై పోవడమే" అని చెప్పి, అతను తన దారిన తను వెళ్లిపోయాడు.

సూర్యం నడుస్తున్నాడు. నడుస్తున్నాడు. ఒక కార్ఖానా దగ్గర ఆగాడు యూనిఫార్మ్‌లో వున్న కుర్రోళ్లు కార్మికులతో కలిపి పని చేస్తున్నారు. చాలా ఉత్సాహంగా సరదాగా పని చేస్తున్నారు. సూర్యం కళ్లు పెద్దవి చేసుకుని చూశాడు. "ఇదేవిటని" ఒక కార్మికుణ్ని అడిగాడు సూర్యం. అతను నవ్వుతూ చెప్పాడు. "వీళ్లందరూ కాలేజీల్లోనూ, హైస్కూళ్లల్లోనూ చదువుకుంటున్నారు. ఐతే, వారానికోసారి కార్ఖానాలకు వస్తారు. మా దగ్గర పని నేర్చుకుంటారు. దీనివల్ల కష్టం అంటే ఏవిటో తెలుస్తుంది. శ్రమజీవి మీద గౌరవం పెరుగుతుంది"

సూర్యం హుషారుగా చలాకీగా వేగంగా నడుస్తున్నాడు. పట్నం దాటేడు. పొలాల్లో దమ్ము చేస్తున్నారు. యూనిఫార్మ్‌లో వున్న విద్యార్థులు పని చేస్తున్నారు. యువకులతోనూ, పెద్దవాళ్లతోనూ కలిపి కేరింతాలు కొడుతూ పని చేస్తున్నారు. సూర్యం 'ఇదేవిటని' అడుగుదామనుకున్నాడు. అర్థం అయ్యింది. "శ్రమకు ఎంత విలువ వుందో" అనుకున్నాడు.

అతనికి ఆనందం అధికం కావడం వల్ల కాళ్లు గాలిలో తేలి పోతున్నాయి. మనసు తెగ మురిసిపోతోంది. సంతృప్తి వల్ల కళ్లు చెమ్మ గిల్లుతున్నాయి.

* * *

మూడు గంటలు ఠంగ్ ఠంగ్‌మని బరువుగా మోగాయి. సూర్యానికి మెలకువ వచ్చింది. ఒళ్ళు విరుచుకున్నాడు. లేచి నిలుచున్నాడు. మార్వాడీ మనసులా నల్లగా వుంది రాత్రి. సూర్యం కళ్ళు మూసుకున్నాడు. కల గుర్తుకు వచ్చింది అతని మేను పులకించింది.

"అమ్మా, వసుమతీ కన్నతల్లీ! నీ ఒంటి మీద భయంకరంగా మొలిచిన వ్రణాలకు ఆపరేషన్ చేసి, నీబాధను పూర్తిగా పోగొట్టగలమా? నీ ముఖం మీద పచ్చని చిర్నవ్వును ఎప్పటికైనా చూడగలమా? కుల మతాలూ, ఎక్కువ తక్కువలూ, ఆకలీ, దోపిడీ లేని మరో ప్రపంచాన్ని సృష్టించుకోగలమా? నేను కన్న స్వప్నాన్ని సత్యం చేసుకోగలమా? స్వేచ్ఛల సంతృప్తుల సమతా జీవనాన్ని సాగించే రోజెప్పుడొస్తుంది"

సూర్యానికి మరి నిద్రరాలేదు. రాత్రికి కావలా కాస్తూనే వున్నాడు. ఆలోచనలకు పదును పెడుతూనే వున్నాడు.

తెల్లవారింది. సూర్యం కటకటాల్లోంచి బయటకు చూస్తున్నాడు.

ఇంతలో —

జైలు గది తలుపులు తెరుచుకున్నాయి. ఒక వ్యక్తిని లోపలికి తోశారు. తలుపులు మళ్ళీ మూసుకున్నాయి.

సూర్యం ఆ కొత్త మనిషిని పరికించి చూశాడు. కొద్దిగా మాసిన గడ్డం. కష్టించి పని చేసేవాడని తెల్పుతూ కండలు తిరిగిన చేతులు, పంచె, బనీను, ముప్ఫై ఏళ్ళకు పైగా వుండొచ్చు.

"నిన్నెందుకు తీసుకొచ్చారిక్కడికి"

"ఎందుకేటి, బుగతవి నరికేసేను"

"ఏం"

"సిన్నప్పట్నించీ ఆడి దగ్గర పనిసేత్తన్నాను. ఒక పూట తినీ, తినకా నా జీతం డబ్బుల్లోంచి కొంచెం కొంచెం మిగిల్చి ఆడి దగ్గర దాత్తన్నాను. ఎందుకని అడగవేం? నా కూతురి మనువు సేద్దారిని. మొన్నదానికి మనవు కుదిర్చేను. బుగత దగ్గరికెళ్ళి, నేన్దాచుకున్న డబ్బివ్వమన్నాను. డబ్బేటన్నాడు, నువు నా దగ్గర దాయటమేటిరా ఎదవా అన్నాడు. బతిమాలేను, నా డబ్బు నాకిచ్చీమని ఆడి కాళ్ళ మీద పడ్డాను. ఆడు ఛీ ఛీ పోరా యెదవా అని గెంటేసేడు. నాకింక ఒళ్ళు కిందా మీదా తెలలేదు. అప్పుడే పచ్చగడ్డి కోసి, దూళ్ళకి పడేసి వచ్చేనేమో కొడవలి చేతిలో వుంది. దాంతో ఆ నంజి కొడుకుని నరికేసేను."

సూర్యం కళ్ళు తళతళా మెరిసేయి. అతను తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. అతని గుండెకు కొండంత బలం వచ్చింది. అతని మెదడులో ఆలోచన్లు ఆనందంగా ఆడుకుంటున్నాయి.

అరుణారుణ కిరణాలు ప్రతి యిసక రేణువునూ తాకుతున్నాయి. ఆకలికి మలమల మాడుతున్న వాళ్ళు.... అన్యాయాలకు ఆహుతి అవుతున్న వాళ్ళు . యింకా శాంతంగా వుంటారా.... యింకానా.... యింకానా...

(సృజన, మేడే ప్రత్యేక సంచిక '74)